# ఔ నౌ ను

—గోపన్నకు – ఏవిచారమూ లేదు:

పెళ్ళాంమాత్రం పుట్టెడు దుఃఖంతో ఉంటుంది, ఎప్పుడు చూసినా; ధుమధుమలాడుతూ అన్నా ఉంటుంది: అక్షులూ – పక్షులూ హాడలేట్టూ, – తన్నూ, – కని పెంచి, పెద్దదాన్ని చేసి, – పీడ వదుల్చుకున్నట్టు, చివరకి యీ నిర్భాగ్యుడికి అంటకట్టిపోయిన తలిదండ్రులనూ, కడుపున ఒక్క–కాయన్నా కాయించకుండా, – కచ్చపట్టినట్టు ఆ రవంత వరమూ యివ్వడానికి మొగమొగాలు చూసుకుంటూన్న దేవాదిదేవులనూ – వాళ్ళకు పితృపితా మహాదులంటూ ఉండేవాళ్ళనూ – తిట్టి దుమ్మెత్తిపోస్తూ ఉంటుంది:

అలా ఎప్పుడూ, నోరు మూతపడకుండా ఆడిపోసుకుంటూ ఉంటుందంటే ఆ యిల్లాలు లోపం ఎంతమాత్రమూ లేదు: గోపన్న ఏదీ పట్టించుకోడు: బెల్లంకొట్టిన రాయల్లే మిన్నువిరిగి మీద పడుతూన్నా తన్నుకానట్టు, నిశ్చింతగా ఉంటాడు: ఇంట్లో, ఆపూటకన్నా వండి వార్చేందుకు–ఉప్పూ

పప్పూ నిండుకున్నా యన్న విచారం లేదు: ఇంటి ఇల్లాలికి,- మెడలో పసుపుకొమ్ము తప్ప - చిన్నం ఎత్తు పుస్తెనా్న లేకపోయెనే అన్న విచారం లేదు-

—'అంతా రాముడి కరుణ - అన్నింటికీ ఆ దయా సింధువే ఉన్నాడు-' ఇలా శ్రీరంగనీతులు చెపుతూంటే,- తనకన్న వేయిరెట్లు దరిద్రంలో మునిగి తేలి, తరించిన భక్తుల చరిత్రలు నిదర్శనంగా ఏకరువు పెడుతూంటే,- ఒళ్లు మండుకు రాదూ ?- ఆయనకు ముదిరిన వేదాంతం ఆడకూతురికి ఎలా అబ్బుతుంది ?-

ఎప్పుడూ చీటికీ మాటికీ కజ్జాతప్పదు- అది రగిలి-రగిలి,- రోజు విడిచి రోజన్నా పస్తులుండటం తప్పదు-ఇదంతా కూడా ఆ రాముని కరుణే !- ఏదన్నా ఓ కారణం అంటూ కనబడితే - ఆపూటకు పొయిలోపిల్లి లేవకపోయెనే - అనే ధ్యాసే పోతుంది: ఇలా కాగా,- కాగా ఏనాటికైనా,- ఈ రెండు పూటలా భోజనంకోసం అంగలార్చడం-, ఉదరం మీద ఉండే ఈ మమతా, క్రమంగా సన్నగిలిపోయి- ఇవన్నీ తుచ్ఛ ఐహిక ప్రమేయములనీ,- రామనామామృతం సేవించితే,- ఆకలి దప్పులు జన్మజన్మలకూ ఉండవనీ,- అందు లవలేశ మన్నా వంటపడితే,- అసలు మళ్ళీ జన్మంటూ ఉండదనీ,- అందుకు,- ఆ సుముహూర్తానికి,- యిప్పుడు పడుతున్నామను కున్న యాతనలన్నీ,- దోహదములనీ,- ఇలా తపించగా తపించగా.. ఆతరుణం రాకమానదనీ,- గోపన్న ఎన్నోవిధాల

నచ్చ చెప్పాలని యత్నించాడు కాని, ప్రయోజనం లేక పోయింది:

లేకపోగా,- ఆనాటి కానాటికి ఆవిడి హాఠం మితిమీరి పోయింది. అందరికిమల్లే తానూ ప్రయోజకుడై,- నలుగురి యిల్లాళ్ళలో తను తలయెత్తుకుని తిరిగేట్టు నిర్వాహకం చేయక పోతే,- ఇహ, ఒక్క క్షణం యీ కాపురం చేయలేనంది: ఏ గంగలోనన్నా దిగుతానంది; అంత అఘాయిత్యం సాగక పోతే,- అధమం పుట్టింటికైనా పోతానంది: ఆ ఎత్తే ముష్టి-నష్టీ అక్కడే యెత్తుకు తింటానంది: తనూ, తన శ్రీరామ చంద్రమూర్తీ కలిసి, ఎల్లకాలమూ ఉట్టికట్టుకు ఊరేగమంది: కుచేలోపాఖ్యానం, మహా భక్తవిజయం కలిపి చలిమంట వేయమంది - ఇది ఏదో తేలేదాకా, గంగ ముట్టనంది - మాటకు మాట జవాబు చెప్పవలసిన అవసరం లేదంది - చెప్పినా విననంది:

గోపన్న,—శ్రీరామచంద్రుడి పటానికి నమస్కారం చేసి.- ఉత్తరీయం వేసుకుని వీధిలోకి వెళ్ళిపోయినాడు: ఇది, ఆయింట మామూలే!-

వెళ్ళడం, తిరిగి తిరిగి మళ్ళీ పూజవేళకు యిల్లుపట్టడం ఇది మామూలే!-

—ఆతడు - అటు వెళ్ళాడో లేదో,- ఎవరో పెద్దమనిషి,- 'గోపన్నగారు ఉన్నరా!' అంటూ వచ్చాడు: 'ఉన్నారా అమ్మా!' అని ఆ యిల్లాలిని పలుకరించాడు.

'లేరు!-' అని ఆమె రుసరుసలాడింది.

'ఎప్పుడొస్తారు ?'

'ఏమో !–'

'భోజనం వేళకు——'

——ఆ యిల్లాలు ఛర్రుమంటూ లేచింది –

'లేరంటే పోరాదూ ?– ఎవరయ్యా మీరు – మీకేం బాకీ ఉన్నారా ?–'

ఆ పెద్దమనిషి,–మృదువుగానే –

'వారి దర్శనానికి వచ్చానమ్మా!–' అన్నాడు :

'అఁ—— అదే నే నంటూంట !–నాకు తెలుసు, వారి దర్శనానికే. ఆయన్నూ నన్నూ నడిబజారులో పెట్టి వేలంవేసినా రాగి డబ్బు రాలదు–!'

——'ఈ ఇల్లాలేం పైత్యానపడ్డదా ?–' అన్నట్టు విస్తుపోయి – ఆ పెద్దమనిషి – 'అదేమిటి తల్లీ !– ఆయన దైవ సమానులమ్మా !–' అని మాత్రం అని, సెలవుపుచ్చుకున్నాడు.

ఆయన గడప దిగీదిగడంతోనే, – పూచిన తంగేడల్లే ఒంటినిండా నగలతో,– వయ్యారి నడకతో,– నవ్వుకుంటూ కలకలలాడుతూ,– 'ఇది తప్పకుండా సానే!' అని తేలికగా అర్థమయే వాలుచూపులతో, – మాంచి ఏపుమీద ఉన్న ఓ సింగారి,– అతి చొరవగా లోపలికి వచ్చి,– 'అమ్మగారూ దణ్ణం!' అంటూ దగ్గిరగా కూర్చుంది :

'ఎవరు నీవు ?–' కొట్టొచ్చినట్టు అడిగింది ఆయిల్లాలు, చూసీ చూడటంతోనే, కళ్ళు కుట్టి–

'అయ్యగారు ఉన్నారా అమ్మ !'

‘ఏం – మా ఆయనతో నీకేం పని ?–’

‘ఉంది !–’

‘ఉందీ ? ఎత్తింది ఆడపుటక కాదూ, సిగ్గులేదూ !– పట్టపగలు నడిబజారుగుండా నడచివచ్చి – ఆయనతో పనుందంటావ్ ? – ఈ ఇంటోకి నిన్నెవరు రమ్మన్నారు. మింగ మెతుకు లేదుగాని, – మధ్య మాకు ఇదో తంటసమా ? – ఇదా, ‘భక్తి!– కనుక్కుంటానుండు–!’

‘అపచార మమ్మా!–’

‘నాకు నీతులు బోధిస్తావు టే– నీ బతుకెంత, నీ వెంత–’

‘జౌనమ్మా !– నామనవి ఆలకించండి !–’

‘ఏమిటా మనవి ?–’

‘ఇదె !–’

—వెయ్యి మొహరీలున్న మూట, చెంగున తీసి, ఆ యిల్లాలి ముందు ఉంచింది – ‘మీదేనమ్మా – మా ముత్తవ తల్లికి అయ్యగారు, – ఏదో చల్లనిముక్క– ఏనాడో చెవిని వేశారు: అదే స్మరించుకుంటూ, సుఖంగా కాలం వెళ్లబుచ్చుకుంది : చివరి గడియల్లో నాకు చెప్పి పోయిందమ్మా – సరిగా నాటికి ఏడాదినాడు,– అయ్యగారికి, ఈ తృణం సమర్పించి,– స్వీకరించమని ప్రార్థించానని మనవిచేయమన్నదమ్మా – నేను మనోహారినమ్మా– మీదర్శనం యీనాపేణా చేసుకున్నాను– కాని, అప్పుడప్పుడు అయ్యవారి పాదాలు కళ్ళకు అద్దుకుంటాను–’

మొగాన బొట్టుపెట్టి,- చేత తాంబూలండుంచి,-ముల్లె అందించి సాగిలి మ్రొక్కింది-

'అదేమిటే నీయిల్లు బంగారంగానూ- నాకు మొక్కుతా వెందుకే- నీవు మంచిదానవు గనుక- మీ ముత్తవతల్లి మాట దక్కించావు! మరొకళ్ళయితే- అప్పుడు తల ఊపినా, - యింత సొమ్ము చేజార విడుచుకుంటారా?- నీకు పిల్ల లెందరు- ఎన్నడన్నా వచ్చి చూసి పోతూండు-'

మనోహరి సెలవు తీసుకుని వెళ్ళిపోయింది- మరో గడి యకు గోపన్న వచ్చాడు- వచ్చి రావడంతోనే,- యిల్లాలు గునగునలాడుతూ,- 'ఏమండోయ్!-'అంటూ గంతువేసినట్టు, వచ్చి, కంఠం పెనవేసుకుని,- గుక్క- తిప్పకుండా చెప్పివేసింది- ముల్లె కళ్ళఎదుట గలగల లాడించింది-

'రామా!-' అన్నాడు గోపన్న నిట్టూర్పుగా- 'పుచ్చుకున్నావా!'

'అదేమిటండీ?- పుచ్చుకోక చేదా?-'

'కాదులే,- వెర్రిదానా?-'

'ఇహ మీ వేదాంతం చాలించండి - లెండి భోజనానికి-'

—ఇలా అంటూండగానే,- యిందాకటి పెద్దమనిషి మళ్ళీ చక్కా- వచ్చాడు, గోపన్నకు మ్రొక్కాడు- చూసీ చూడటంతోనే,- ఆ యిల్లాలు నవ్వు మొగంతో,- 'దయ చేయండి బాబూ!' అని ప్రత్యుత్థానం చేసి,- 'ఇంతకు ముందు ఒకసారి వచ్చి వెళ్లారండి. 'వస్తారు ఉండండి!' అందా

మనుకుంటూండగానే చక్కా బోయినారు- వారిని కూడా భోజనానికి ఉండమనండి-' అంటూ లోపలికి చక్కా బోయింది.

'ఎవరుబాబూ తమరు ?' గోపన్న ఎంతో వినయంగా పలుకరించాడు: వచ్చిన పెద్దమనిషి, అదాటున గోపన్న పాదము లందుకుని కళ్ళకు అద్దుకున్నాడు.

'అదేమిటి బాబూ !' అని గోపన్న కలవరపడుతూ తప్పుకుని,- లేవనెత్తాడు-

'అంతే అయ్యా!- ఇందుకోసం ఇన్నాళ్లూ తపించాను- ఇప్పటికి తరించాను-

"కొన్నేళ్ళ క్రితం-గోదావరి స్టేషనులో, రాత్రిపూట మీరు నిద్రపోతూండగా,- మీరొండినున్న మూడు పచ్చ నోట్లూ మాయమైనాయ్, కాదూ? తీసింది, నేనే.- అప్ప టికి నాకు అదే వృత్తి- కాని. ఆసొమ్ము వచ్చిన వేళావిశే షాన ఆనాటినుంచీ నేను పట్టింది బంగారమైంది: అనుకో కుండా, ఏమీ యత్నంలేకుండా, అన్నీ కలసివచ్చినవి వాటం తట అవే:

'నేను మళ్ళీ ఎన్నడూ నీచానికి దిగలేదు- మీసొమ్ము విడిగా వర్తకంలో తిప్పాను- వృద్ధి అయింది- మనవి చేసుకుం దామని వచ్చాను- అనుగ్రహించారా!-'

గోపన్న ఆశ్చర్యపడలేదు- కనురెప్పైనా కదలించ లేదు.

'శ్రీరాముడికి దయకలిగింది నాయనా!- ఆ కొంటె వాడు ఎప్పుడూ యింతే-'

ఇల్లాలు, - లోపలికి వెళ్ళినట్టు వెళ్ళిందేకాని, - లోగుమ్మంలో నిలుచుని, ఇదంతా ఆలకించింది- కళ్ళింతలు చేసుకుని-

'ఏంబాబూ,- ఏమాత్రం వృద్ధి అయింది?-' అన్నది-

'లక్ష రూపాయలు దాటుతుందమ్మా!- యీ యేటి లాభాలు కలుపలేదింకా?-'

'నా ఉనికి ఎలా తెలిసింది నాయనా!-' అని గోపన్న కించపడుతూ అడిగాడు-

'ఆనాడు పైకంతోబాటు రైలు టిక్కెట్టుకూడా ఉందికదా బాబూ:- ప్రయాణం ఎక్కడికో తెలిసింది-యాదా లాభంగాచూసి,- మీపక్కనే జారివిడిచాను - తరువాత కొన్నాళ్ళకు యీ ఊరువచ్చి జాడలు తీశాను- మీదర్శనం చేశాను: అప్పుడప్పుడువచ్చి మీకంటపడకుండా, దూరాన్నుంచే మ్రొక్కి పోతూండేవాడిని - ఈ మాత్రమైనా కూడబెట్టి, అప్పుడొచ్చి, మీపాదాలదగ్గిర వ్రాలుదామనుకున్నాను: ఈనాటి కది సిద్ధించింది:-

'ఉన్నంతలో, భుజించి ఆపెద్దమనిషి,- సెలవు తీసుకున్నాడు. తనకు అగత్యం లేదు,- ఆసొమ్ము తన యిల్లాలి పరం చేయవలసిందని, గోపన్న, - అతడలా ప్రాధేయపడుతూంటే అసలు కాదనలేక, ఒప్పుకున్నాడు-

—'ఇవాళ లేచిన వేళ ఎటువంటిదండీ!' అని ఆయిల్లాలు కలకలలాడింది. చిటిపొటి పోణెములు ఎన్నో చేయబోయింది: తాము, ముందుముందు, ఎలా సుఖపడపోయేదీ,–ఇన్నాళ్లుగా మనసులోనే కుమిలి హుతమారి పోతూన్న ముద్దు మురిపెము లన్నీ ఎలా తీర్చుకునేదీ, నోరు నొప్పి లేకుండా ఏకరువుపెట్టింది. అన్నీ విని, విని,– గోపన్న,–

'ఇంతటితోనైనా, కడుపు నిండినట్టేనా ?' అని నవ్వుగా సౌమ్యంగా అడిగాడు–

'ఆహా!. నాకింకేం కోరికా లేదు : నేను పట్టిననోములు ఫలం లేకుండా పోతాయా!–ఇల్లాగే మళ్ళీ యీనాటికి మన నట్టింట ఉయ్యాలతొట్టె వేసుకుంటే–'

గోపన్న వంక కొత్త పెళ్ళికూతురల్లేచూసి సిగ్గుపడ్డది–

గోపన్నకు,– కన్ను తడి అయింది.

పూజామందిరం దగ్గిరకు వెళ్ళి– 'అర్థం అయింది ప్రభూ!–' అని నవ్వాడు– వచ్చేశాడు–

—గోపన్న మళ్ళీ యింటికి రానే లేదు: ఎందరిని విచారించినా ఎవరికీ ఆచోకీ తెలియదు: ఎన్ని దేశాలు గాలించినా, జాడేలేదు: ఏమైపోయినాడో తెలియదు:

—వేసీ వేయకుండా ఉన్న ఆయింట్లో– ఆయిల్లాలు ఒక్కతే– ఎప్పుడూ ఆ పూజామందిరం దగ్గిరే కూర్చుంటుంది– 'అర్థం అయింది ప్రభూ! అనుగ్రహించు!–' అని జపిస్తూ ఉంది:

తొలిరోజుల్లో విలవిలా ఏడ్చేది- భయపడేది- ఇప్పుడు- ఏవిచారమూ లేదు; అతిశాంతంగా ఉంటుంది- ఏనాటికైనా అతడు తిరిగివస్తాడనే నమ్మకం ఉంది- ఎప్పుడు వస్తాడో అనే ఆరాటం మాయమైంది- అలా, రాముణ్ణిచూస్తూ కూర్చోడం తప్ప.- ఆయిల్లాలికి మరోకోరికే- ధ్యాసే- లేదు.-